## ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు డిఎస్‌సికి ఉచిత శిక్షణ

### జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి శోభారాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డిఎస్‌సి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి తెలిపారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇవ్వనునట్లు పేర్కొన్నారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఆ టెస్టులో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీని ఇచ్చి, వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న వారిని ఎంపిక చేస్తారన్నారు. స్థానిక సచివాలయంలో ఆరు ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 21న తుదిగడువు అని పేర్కొన్నారు. కోచింగ్ ఎంపిక కోసం ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు ఈ 27న నిర్వహిస్తారని తెలిపారు.

# మూషికాల ముప్పేట దాడి

**వరి దుబ్బులను ఇష్టానుసారం కొరికేస్తున్న ఎలుకలు**

**ఒక్కో ఎలుకను పట్టించడానికి రూ.100 ఖర్చు**

**ఎకరాకు అదనంగా రూ.2 వేలు పెట్టుబడి**

**వరుస కష్టాలతో రైతుల ఆవేదన**

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ సాగుపై మూషికాలు ముప్పేట దాడి చేస్తున్నాయి. వరి పొలాలు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఎలుకల ధాటికి రైతులు విలవిల్లాడుతున్నారు. ఒక ఎలుకను పట్టించాలంటే రూ.100 ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతన్నకు ఎలుకలు పట్టించేందుకు అదనంగా రూ.రెండు వేలు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుస కష్టనష్టాలతో విలవిల్లాడుతున్న రైతులను ఎలుకల బెడద వెంటాడుతోంది.

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగులో రైతులు అష్టకష్టాలు పడ్డారు. వరుస వర్షాలు వరదలతో తీవ్ర నష్టాలను చవిచూశారు. అయినా గంపెడాశతో సాగును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారే తప్ప వెనకడుగు మాత్రం వేయలేదు. అయితే వరి చేలు కీలక దశలో మారిన నేపథ్యంలో ఎలుకల బెడద రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలుకలు పట్టించాలంటే అదనపు పెట్టుబడి తప్పని పరిస్థితి. ఒక్క ఎలుకను పట్టించాలంటే రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నెల రోజులుగా ఖరీఫ్ పంటపై మూషికాల దాడి పెరగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి దుబ్బులను ఎక్కడికక్కడే కొరికి పారేస్తున్నాయి. వీటిని కట్టడి చేయడానికి రూ.వేలకు వేలు ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉంది. అయితే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినప్పటికీ అది ఆలస్యం కావడంతో ఆశించిన మేర ఫలితాలు రాలేదు. జిల్లావ్యాప్తంగా 1150 కేజీల బ్రోమిడియాల్ మందును రైతులకు పంపిణీ చేశారు. అయితే ఈ మందు ఎంతవరకు రైతులు వినియోగించుకున్నారనేది అనుమానమే.

ఎలుకలు పట్టుకునేందుకు బుట్టలు ఏర్పాటు చేస్తున్న వ్యక్తి

జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో ఖరీఫ్ పంట కోత దశకు చేరింది. భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, పెనుమంట్ర మండలాల్లో ముంపునకు గురైన చేలలో ఇటీవలే వరి నాట్లను పూర్తి చేశారు. ఒకచోట కోతకు, మరోచోట దుబ్బు దశలో, అత్యధిక శాతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పటికే ఒకటికి రెండుసార్లు నారుమళ్లు వేసి నష్టపోయిన రైతులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు మరోమారు వరినాట్లు వేయాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం సుమారు లక్ష ఎకరాలకుపైగా పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ దశలో వరి దుబ్బులు పొట్టతో ఉండటంతో వరి కర్రలు తీపిని కలిగి ఉంటాయి. ఈ పరిస్థితి ఎలుకలకు ఎంతో అనుకూలంగా, ఇష్టంగా ఉంటుంది. ఈ కారణంగా పొట్ట దశలో మూషికాల దాడి విచక్షణారహితంగా ఉండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు మూషికాలను అదుపు చేయడానికి అదనంగా రూ.2 వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ముంపు సమస్యతో కొన్ని వరిచేలు కురసగా ఉండటం, మరికొన్ని చేలు ఏపుగా పెరిగి ఎత్తుగా ఉండటం, పొట్ట దశలో ఉండటంతో వీటి దాడి ఏపుగా పెరిగిన వరిచేలపై ఎక్కువగా కన్పిస్తోంది. అయితే వీటిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎలుకలకు అనుకూల వాతావరణం..**

పట్టు బడిలో చిక్కిన ఎలుకలు

వరదలు, వర్షాల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో కాలువలు, పుంతలు వెంబడి ఉన్న ఎలుకలు ముంపు కారణంగా ఇతర మెరక ప్రాంతాలకు చేరుకుంటాయి. ఆయా ప్రాంతాల్లో తమ ఆహార అవసరాలు తీర్చుకునేందుకు సమీపంలోని వరి చేలపై దాడి చేస్తున్నాయి. ఒక ఎలుక సుమారు రెండు కిలోమీటర్లు వరకు వెళ్లి పంటను పాడు చేసే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణం ఎలుకల సంతానోత్పత్తికి అనుకూలంగా ఉండడంతో నెల రోజుల వ్యవధిలోనే వీటి సంతానం పది రెట్లు పెరుగుతుందని ప్రాథమిక అంచనా. ఈ ఏడాది సామూహిక ఎలుకల నిర్వహణా కార్యక్రమం కూడా ఆలస్యం కావడంతో వీటి ఉధృతికి మరో కారణంగా కన్పిస్తుందని రైతులు చెబుతున్నారు.

## నేడు మద్యం దుకాణాలకు లాటరీ

జిల్లా కలెక్టర్ నాగరాణి

**175 దుకాణాలకు 5627 దరఖాస్తులు**

**లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈ నెల 14న సోమవారం నిర్వహించనున్న మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. నూతన మద్యం పాలసీలో భాగంగా 2024-2026కు సంబంధించి లైసెన్స్‌ల మంజూరుకు భీమవరం స్టేషన్ పరిధిలోని 40 దుకాణాలకు 1,287 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో గెజిట్ నెంబర్ వారీగా, సర్కిల్‌వారీగా లాటరీ విధానంలో మద్యం దుకాణాలు అత్యంత పారదర్శకంగా కేటాయిస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ వ్యక్తులు నిర్దేశించిన సమయానికి తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. దరఖాస్తుదారుడు తన అప్లికేషన్ ఫారం, ఎంట్రీ లేదా గేట్‌పాస్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ దరఖాస్తుదారుడు హాజరు కాని పక్షంలో వారు ఎవరినైనా ఆథరైజ్ చేస్తే సదరు వ్యక్తి ఆథరైజ్ ఫారంతోపాటు పాన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ నకలు వెంట తీసుకురావాలని తెలిపారు. షాప్ కేటాయించిన వ్యక్తులు సదరు లైసెన్సు ఫీజులో మొదటి వంతు నగదు రూపేణగాని లేదా ఆన్‌లైన్ చెల్లింపు ద్వారాగానీ ఆక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ కౌంటర్లో చలాన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. లాటరీకి వచ్చే దరఖాస్తుదారులు వారి వాహనాలను కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు.

| ఎక్సైజ్ స్టేషన్ | దుకాణాల సంఖ్య | దరఖాస్తులు |
|---|---|---|
| తణుకు | 33 | 877 |
| తాడేపల్లిగూడెం | 36 | 1,224 |
| పాలకొల్లు | 19 | 873 |
| నరసాపురం | 24 | 958 |
| ఆకివీడు | 23 | 408 |
| భీమవరం | 40 | 1287 |
| మొత్తం | 175 | 5,627 |

## పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, మబ్బులు, వాన దోబూచులాడుతున్నాయి. పలుసార్లు వర్షం వచ్చి ఏ పనీ సాగకుండా అడ్డుపడుతోంది. దీంతో వివాహ వేడుకలు, శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు, అన్న సమారాధన, నిమజ్జనాలకు తీవ్ర అంతరాయం కలిగింది. సాయంత్రం ఏకధాటిగా అరగంటపాటు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

# పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలి

**గోపీమూర్తి పరిచయ సభలో వక్తల పిలుపు**

**సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తి గోపీమూర్తి**

**పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు**

**అందరి పక్షాన పిడిఎఫ్ పోరాటం**

**ఎంఎల్‌సి ఐవి**





అభివాదం చేస్తున్న ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ నేతలు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి, పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శాసనమండలిలో ప్రాతినిధ్యం వహించడమే కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రజల గొంతు వినిపించాలంటే గోపీమూర్తిని గెలిపించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత నేడు ఎంతో ఉందన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి పరిచయ కార్యక్రమ సభ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ గోపీమూర్తి అభ్యర్థిత్వాన్ని బలపరిచి మద్దతు తెలిపారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు గోపీమూర్తి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.లక్ష్మణరావు బలపర్చారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుత యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి పోటీ చేయనున్నట్లు కెఎస్.లక్ష్మణరావు ప్రకటించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, బుద్ధుని విగ్రహానికి ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) శాసనమండలిలో ప్రజాపక్షంగా పని చేస్తుందన్నారు. సామాన్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, చిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అవసరమైన సందర్భాల్లో బాధితులతో కలిసి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉన్న గోపీమూర్తిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ 2007 నుండి ఇప్పటి వరకు జరిగిన శాసనమండలి ఎన్నికల్లో నీతి నిజాయతీలతో సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తులను అభ్యర్థులుగా నిలిపి ఘనమైన విజయాలు సొంతం చేసుకున్న చరిత్ర పిడిఎఫ్‌కు ఉందని గుర్తు చేశారు. రానున్న కాలంలోనూ పిడిఎఫ్ ఆ రకమైన ఒరవడిని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే గోపీమూర్తిని అభ్యర్థిగా ప్రకటించామని, ఆయన గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యత, సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి గోపీమూర్తి అన్నారు. అటువంటి వ్యక్తిని శాసనమండలికి పంపించాలని కోరారు. ప్రజా గొంతు వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఎంఎల్‌సిగా పోటీ చేసేందుకు అవకాశం దక్కడం తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫాఆలీ, ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు పద్మావతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బిఎల్‌జె.గాంధీ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.వాసు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుకు.. భరోసా ఇస్తారా..

**సీడ్స్ కంపెనీల నిరంకుశ ధోరణికి అడ్డుకట్ట పడేనా**

**రైతులకు అగ్రిమెంట్లు రాయకుండా ప్రతియేటా సీడ్స్ అందజేత**

**పంట దెబ్బతింటే రైతులను పట్టించుకోని కంపెనీలు**

**మొక్కజొన్న సీడ్స్ సాగుపై వ్యవసాయ శాఖ తీవ్ర నిర్లక్ష్యం**

**జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు**

**2019కు ముందు సీడ్స్ కంపెనీల తీరును నిరసిస్తూ జెడ్‌పి తీర్మానం**

**విత్తన చట్టంలో లోపాలతో ఇష్టారాజ్యంగా సీడ్స్ కంపెనీలు**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో అతి పెద్దసాగుగా ఉన్న మొక్కజొన్న సాగులో రైతులకు భరోసా లేకుండాపోయింది. సీడ్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ప్రభుత్వం మారడంతో మొక్కజొన్న సాగుకు భరోసా కల్పించాలంటూ రైతులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో అతి పెద్దసాగుగా మొక్కజొన్న ఉంది. జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల్లో మొక్కజొన్న రైతులు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 27 శాతం మొక్కజొన్న ఉంది. ఇంత పెద్దమొత్తంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపై వ్యవసాయశాఖ పర్యవేక్షణ సరిగా లేకుండాపోయింది. మొక్కజొన్న సాగులో రెండు రకాల సాగు పద్ధతులు ఉంటాయి. కమర్షియల్ పద్ధతి ఒకటి, కంపెనీ సీడ్స్ తీసుకుని సాగుచేసే పద్ధతి మరొకటి. జిల్లాలోని మొక్కజొన్న సాగులో 60 శాతానికిపైగా కంపెనీలు అందించే సీడ్స్ ఆధారంగానే సాగు సాగుతోంది. రైతుల వద్దకు వెళ్లి కంపెనీలు తమ సీడ్స్ అందిస్తాయి. ఎకరాకు పెద్దమొత్తంలో దిగుబడి వస్తుందని నమ్మబలికి ఈ సీడ్స్ ఇస్తారు. పండిన పంటను కంపెనీలే కొనుగోలు చేస్తాయి. ముందుగా కొంతమేర పెట్టుబడి సైతం కంపెనీలు అందిస్తాయి. ఈ విధంగా కంపెనీలు అందించే సీడ్స్ సాగు చేసిన పొలాలు సరైన దిగుబడులు రాక దెబ్బతింటే నిబంధనల ప్రకారం కంపెనీలు ఆ నష్టాన్ని రైతులకు అందించి ఆదుకోవాలి. ఎక్కడా అలా జరగడం లేదు. ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీలు తమ మొక్కజొన్న సీడ్స్‌ను రైతులకు అందిస్తున్నాయి. మూడు టన్నుల దిగుబడి రాని పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. సీడ్స్ సాగులో ఎకరాకు రూ.50 వేలకుపైగా పెట్టుబడి ఖర్చవుతోంది. కౌలు ఎకరానికి రూ.30 వేలు వరకూ ఉంటుంది. అన్నీ కలిపి ఎకరాకు రూ.80 నుంచి రూ.90 వేలు వరకూ ఖర్చవుతోంది. కంపెనీ సీడ్స్ సాగు చేసిన పంటను టన్ను రూ.15 వేల నుంచి రూ.16 వేలు వరకూ కొనుగోలు చేస్తారు. మూడు, నాలుగు టన్నుల దిగుబడి వస్తే ఎకరాకు రూ.60 వేలు సొమ్ము రావడమే గగనంగా మారుతోంది. దీంతో రైతులు ఎకరాకు రూ.30 వేల వరకూ నష్టపోతున్నారు. కొయ్యలగూడెం, దెందులూరు, పెదవేగి ఇలా అనేక మండలాల్లో ప్రతియేటా మొక్కజొన్న సీడ్స్ సాగు చేసి రైతులు దెబ్బతింటున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు తమ సీడ్స్‌ను రైతులకు అందించేటప్పుడు అగ్రిమెంట్లు రాయాలి. పంట దిగుబడి రాకపోతే కంపెనీ ఆదుకుంటుందని అందులో పొందుపరచాలి. ఎక్కడా ఆ విధంగా జరగడం లేదు. వ్యవసాయ శాఖాధికారులు కూడా కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాసేవిధంగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. సీడ్స్ సాగు ఎంత జరుగుతుందో కూడా సమాచారం వ్యవసాయశాఖ వద్ద ఉండటం లేదు. విత్తన చట్టంలో ఉన్న లోపాల కారణంగా ఈ పరిస్థితి నెలకొందని చెప్పొచ్చు. కమర్షియల్ సాగులో విత్తనాలను రైతులే కొనుగోలు చేసుకుని సాగు చేస్తారు. పండిన పంట క్వింటాకు రూ.2300కుపైగా ధర ఉంటుంది. మార్కెట్ ధర తక్కువగా ఉంటే మార్కెటింగ్ శాఖ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగులో అటువంటి పరిస్థితి లేకుండా పోతుంది. దీంతో రైతులు ప్రతియేటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

**భరోసా కల్పించి రైతులకు అండగా ఉంటారా?**

మొక్కజొన్న సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అక్టోబర్ 20వ తేదీ తర్వాత రైతులు సాగు ప్రారంభించనున్నారు. మొక్కజొన్న సీడ్స్ కంపెనీల ప్రతినిధులు ఇప్పటికే గ్రామాల్లో తిరుగుతున్నారు. తమ కంపెనీల సీడ్స్‌ను రైతులకు అంటగట్టేందుకు ఏమారుస్తున్నారు. సీడ్స్ అందిస్తున్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే అన్నదాతకు భరోసా ఉంటుంది. 2019కు ముందు గత టిడిపి ప్రభుత్వంలో మొక్కజొన్న సీడ్స్ సమస్యపై రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. కంపెనీలు తమను మోసగిస్తున్నాయంటూ గగ్గోలు పెట్టారు. దీంతో అప్పుడు దెందులూరు ఎంఎల్ఏగా ఉన్న చింతమనేని ప్రభాకర్ జిల్లా పరిషత్ సమావేశంలో దీన్ని ప్రస్తావించారు. దీనిపై పెద్దఎత్తున చర్చ సాగింది. అప్పటి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ విత్తన కంపెనీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడతామని హామీ ఇచ్చారు. దీనిపై జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం సైతం చేశారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం మొక్కజొన్న రైతుల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి రైతుల్లో ఆశలు చిగురించాయి. మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అగ్రిమెంట్లు రాసిచ్చేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అంతేకాకుండా సరైన విత్తన చట్టం తీసుకొచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేస్తున్నారు. కంపెనీల సీడ్స్ సాగు చేసే పొలాలకు సంబంధించి ఇ-క్రాప్ చేయడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో పంట నష్టపోయినా పరిహారం వంటివి రైతులకు అందని పరిస్థితి నెలకొంది. మొక్కజొన్న రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నేటి నుంచి మూడు రోజులు భారీ వర్షాలు

**జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలి**

**అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పట్టణాలు, పల్లెల్లోని కాలువలు, డ్రెయినేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకోకుండా ఉండేందుకు ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖాధికారులు రైతులకు తమ పంటలను వర్షాల నుండి ఎలా సంరక్షించుకోవాలో సూచనలు అందించాలన్నారు. పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జల వనరుల శాఖాధికారులు డ్రెయిన్లు, కాలువల్లో నీటి మట్టాలను నిరంతరాయంగా పర్యవేక్షించాలన్నారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జల వనరుల శాఖాధికారులు, జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు జిల్లా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## నిస్వార్థ ప్రజాసేవకుడు వెన్నపు ప్రసాద్

నిస్వార్థ ప్రజాసేవకుడు వెన్నపు ప్రసాద్

ప్రసాద్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్‌ఏ దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - ఆచంట

సొసైటీ డైరెక్టర్ విషయంలో తమ పార్టీలోకి రావాలంటూ రెండు ఎకరాల పొలం, కొంత నగదు ఇస్తామని టిడిపి భూస్వాములు ఎన్ని ప్రలోభాలు పెట్టినా తాను నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి నిజాయతీగా నిలబడిన నేత వెన్నపు ప్రసాద్ అని సిపిఎం నేత, ఆచంట మాజీ ఎంఎల్‌ఏ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్త, ఆచంట సొసైటీ డైరెక్టర్, పంచాయతీ బోర్డు సభ్యులు వెన్నపు ప్రసాద్ సంతాప సభ ఆచంట వేమవరం హరిజన పేటలో ఆదివారం తలుపూరి బుల్లబ్బాయి అధ్యక్షతన జరిగింది. తొలుత ప్రసాద్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ వెన్నపు ప్రసాద్ సుమారు 45 సంవత్సరాలపాటు నిస్వార్థంగా పని చేసి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ముఖ్యంగా కూలి రేట్ల పోరాటంలో ముందుండేవారిన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కొండేటి సత్యనారాయణ, గుత్తుల రంగారావు, పి.మోహనరావు, తోటపల్లి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, జిల్లెళ్ల కృష్ణమూర్తి, మైలే వెంకట్రావు, బళ్లారి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, రాపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## నేటి నుంచి పల్లె పండుగ : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలో పండుగ వాతావరణంలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 423 పనులను రూ.51.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. వీటిలో 351 సిసి రోడ్లకు రూ.41.94 కోట్లు, ఐదు బిటి రోడ్లకు రూ.2.46 కోట్లు, 67 సిసి డ్రెయిన్లకు రూ.6.63 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ ఏడాది చేసే అభివృద్ధి పనులకు సంబంధించి ఆ గ్రామంలో బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్, నీటి సరఫరా శాఖల ద్వారా పంచాయతీ పరిధిలో మంజూరు చేసిన పనులను గ్రామాల్లో గొడింగ్ సంబంధించి పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కడెక్కడ ఏఏ పనులు చేసి, వాటికి సంబంధించి ఎప్పుడు పూర్తి చేస్తారో పూర్తి వివరాలను గ్రామసభలో ప్రజలకు తెలియజేసేలా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

## పెనుమంట్ర ఎస్ఐగా స్వామి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ఎస్ఐగా కె.స్వామి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు ఐదు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో పనిచేసిన ఆయన పెనుమంట్ర ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - వీరవాసరం

ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం రైతాంగానికి గిట్టుబాటు ధర చట్టం చేయకుండా కక్ష సాధిస్తోందని బలరాం విమర్శించారు. ఆదివారం నవుడూరులో సిపిఎం గ్రామ శాఖ మహాసభ చాట్ల భీమా అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామ శాఖ కార్యదర్శి అయినపర్తి బాబూరావు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల ఆత్మలు తీర్చలేక సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు స్పందించక పోవడం అన్యాయమన్నారు. నవుడూరులో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, వాటర్ ట్యాంకు శుభ్రం చేయాలని, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చి దోమలు, ఈగలు బారి నుండి కాపాడాలని తదితర సమస్యలపై లింగం సత్యనారాయణ పెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాఖ కార్యదర్శిగా మరలా అయినపర్తి బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, గ్రామ శాఖ సభ్యులు ఏళ్ల బండి మారియ నాయుడు, త్రిమూర్తులు, యాళ్లబండి నారాయణమూర్తి పాల్గొన్నారు.

**ఆకివీడు :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక 11వ వార్డు శాంతినగర్‌లో కంచాడ మోహన్‌రావు నగర్‌లో వార్డు మహాసభ జరిగింది. బి.పార్వతి అధ్యక్షతన జరిగిన సభలో తవిటినాయుడు పాల్గొని ముందుగా జెండాను ఆవిష్కరించారు. ముందుగా సిపిఎం అఖిల భారత మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మహిళా శాఖ నూతన కార్యదర్శిగా బల్లెడి పార్వతి, పురుషుల శాఖ కార్యదర్శిగా కింజరపు శంకర్‌ను ఎన్నుకున్నారు. శాఖ సభ్యులుగా కె.తవిటమ్మ, పి.కుమారి, కింజరపు.వరాలమ్మ, బత్తిన.అప్పారావు, లింగాల.బలరాం, కె.గౌరినాయుడు, బి.రాంబాబు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కాళ్లలో ఎలక్ట్రిక్ బైక్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బైక్‌లను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. విజయదశమి సందర్భంగా కాళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన వేణు మోటార్ ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ధర్మవరంలో తయారుచేసిన వేణు మోటార్స్ లైసెన్స్ అవసరం లేని స్కూటీలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. 9 వాహనాలు సేల్ జరిగాయన్నారు. ట్రాక్ కూడా రద్దు చేయడంతో పాటు వినియోగదారులకు తక్కువ ధరకు లభిస్తున్నాయన్నారు. మంతెన రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, కనుమూరు భరత్, బోనం నారాయణమూర్తి, ఆరేటి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థి దశలో జ్ఞాపకాలను ఎన్నటికీ మరువలేనివని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు రాజీ, రాధ, వాణి, అనసూయ, శారద, మోహిని, చిన్నయ్య పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం ఒకరికొకరు పలకరించుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు.

## బాలిక వైద్యానికి వసుధ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు 15 వేల రూపాయల చెక్కును జిన్నూరు గ్రామానికి చెందిన బాలిక మారిశెట్టి సింధుకు ప్రముఖ రైస్ మిల్లర్ పి.రామచంద్ర రాజుకుమారుడు అరుణ్ కుమార్‌రాజు చేతుల మీదుగా అందజేశారు. సింధు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలిసిన వెంటనే వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. బాలిక తల్లిదండ్రులు వసుధ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నకిలీ పోలీసులమని బీచ్‌లో డబ్బులు వసూలు

### ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

బీచ్‌లో పర్యాటకులను పాల్పడుతున్న ముగ్గురు నకిలీ పోలీసులను ఆదివారం అరెస్టు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 11న మండలంలోని పేరుపాలెంసౌత్ గ్రామానికి చెందిన మండ శ్రీనివాస్ అతని తమ్ముడు అనిల్‌కుమార్ మోళ్లపర్రు బీచ్‌లో ఉండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి పోలీసులమని చెప్పి దౌర్జన్యంగా వారి నుండి రూ.500 లాక్కుని వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన దవులూరి సందీప్, దిరుసుమర్రు పంచాయతీ పెదపేటకు చెందిన వర్దనపు ప్రసాద్, శ్రీరాంపురం పంచాయతీ సత్యనారాయణ పురానికి చెందిన మండ కిరణ్ కుమార్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## రామలింగేశ్వరరావు చిరస్మరణీయులు

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీకృష్ణ కళ్యాణ కింకిణి అను రుక్మిణీ కళ్యాణ పద్య కావ్య పుస్తకావిష్కరణ మహోత్సవంలో పట్టణ ప్రముఖులు పేరాల రామలింగేశ్వరావు చిరస్మరణీయులని ఆరిడిఓ దాసిరాజు అన్నారు. శనివారం రాత్రి స్థానిక వైఎన్ కళాశాల పిజి సెమినార్ హాల్లో దివంగత పేరాల రామలింగేశ్వరరావు శతజయంతి అక్షరోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ కళ్యాణ కింకిణి పద్య కావ్యాన్ని ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరిడిఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, సాహితీ ప్రియులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్ : 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్ : 83339 88814

# ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్లు..

**పెరుగుతున్న ఆదరణ**

ప్రజాశక్తి - తణుకు

పేదల ఆకలి తీర్చడం కోసం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లకు ప్రజల ఆదరణ పెరుగుతోంది. ఉదయం టిఫిన్‌తో మొదలై మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం ఇలా మూడు పూటలా పేదవారి ఆకలి తీర్చడంలో సత్ఫలితాలనిస్తుంది. ఇతర గ్రామాల నుంచి పనుల నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వచ్చిన పేదలకు ఈ అన్నాక్యాంటీన్‌లు రూ.5కే భోజనం పెట్టి కడుపు నింపుతున్నాయి. ఇలా రోజుకు సుమారుగా 500 మంది ఈ క్యాంటీన్ల వినియోగించుకుంటున్నారు. కార్మికులు, రిక్షా కార్మికులు, వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చే వారు ఇలా నిత్యం అనేక మంది అన్నా క్యాంటీన్లపై ఆధారపడుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు దీటుగా.. పెరుగుతున్న భోజనం ధరలతో నిరుపేదల ఆకలి తీరుతుంది.

తణుకులో ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్

**ఆహార పట్టిక ఇలా..**

టిఫిన్‌లో ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్ ఇలా రోజువారీగా టిఫిన్ అందుబాటులో ఉంటున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం తెల్ల అన్నంతో పాటు పప్పు, కూర, సాంబారు, పెరుగు పద్ధతిలో భోజనం అందజేస్తున్నారు. ఇందుకోసం హరేకృష్ణ సంస్థ సేవలందిస్తుంది. పేదలకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించేలా సంస్థ ప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారు.

**దుష్ప్రచారానికి తెరలు..**

అన్నా క్యాంటీన్లపై పెరుగుతున్న ఆదరణతో కొందరు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. గతంలో తణుకు అన్నా క్యాంటీన్‌లో భోజనం ప్లేట్లను మురుగు నీటితో శు భ్రపరుస్తున్నారని ఒక వ్యక్తి ఆగస్టు 19న మద్యం సేవించి అన్నా క్యాంటీన్‌కు వచ్చి సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీశాడు. ఈ వీడియోను ఆదేనెల 26న సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యింది. ఈ ప్రచారం మంత్రి లోకేష్ వరకూ వెళ్లడంతో వారు శుభ్రత విషయంలో ఆరా తీశారు. తణుకు మున్సిపల్ అధికారులను, హరేకృష్ణ సంస్థ నిర్వాహకులను నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్లేట్లు కడిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి**

**మున్సిపల్ కమిషనర్ వి.వి.రమణ**

భోజనం చేసిన ప్లేట్లు డస్ట్‌బిన్‌లో వేయాల్సి ఉండగా రద్దీగా ఉన్న క్రమంలో కొంత మంది వాటిని వాష్‌బేసిన్‌లో పడేస్తున్నారు. ప్లేట్లు కడిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి.

# పట్టభద్రుల ఎంఎల్‌సిని మంచి మెజార్టీతో గెలిపించుకుందాం

**మంత్రి నిమ్మల రామానాయుడు**

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదులో కూటమి నాయకులు భాగస్వాములై గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఆదివారం స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో పాలకొల్లు నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదు అవగాహనా సదస్సు జరిగింది. ఎంఎల్‌సి వేపాడ చిరంజీవిరావు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజుతో కలిసి మంత్రి రామానాయుడు మాట్లాడారు. శాసన మండలిలో మన ప్రాంత సమస్యలపై గళం వినిపించేందుకు గెలిపించి పంపించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. నమోదు సమయం తక్కువ ఉన్నందున పట్టభద్రుల ఓట్ల నమోదు వేగవంతం చేయాలని కోరారు. ప్రతి ఇంటినీ, ప్రతి బూత్‌ల వారీగా తిరిగి పట్టభద్రులను గుర్తించి ఆఫ్ లైన్లోగానీ, ఆన్‌లైన్‌లో గాని ఓటు నమోదు చేయించాలన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి గ్రామాల్లో పండుగ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నామని, గ్రామాల్లో పెండింగ్లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు నమోదు ప్రక్రియ 30 నియోజకవర్గాలకు సంబంధించిందని ఎన్‌డిఎ నాయకులు కలిసి కట్టుగా తిరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్‌గా ఎంపికైన మంతెన రామరాజును ఘనంగా సత్కరించారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, బోణం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, జక్కంపూడి కుమార్, ధనాని సూర్యప్రకాష్, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

**కాళ్ల :** ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదులో కూటమి నాయకులు భాగస్వాములై గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు కోరారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఉండి నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎంఎల్‌సి వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎన్‌డిఎ నాయకులు కలిసికట్టుగా తిరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. శాసన మండలిలో మన ప్రాంత సమస్యలపై గళం వినిపించేందుకు గెలిపించి పంపించాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. ఎపిఐఐసి ఛైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు మంతెన రామరాజు, కనకరాజు సూరి, జుత్తిగ నాగరాజు మాట్లాడారు. ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, కనకరాజు సూరి, జుత్తిగ నాగరాజు, మోటుపల్లి రామ వరప్రసాద్, జుత్తిగ శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మంతెన రామరాజును ఘనంగా సత్కరించారు.

**నరసాపురం :** నరసాపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు (వర్క్ షాప్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి (ఏపీఐఐసీ) ఛైర్మన్ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా అందరూ తమ ఓట్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

# ఉచిత ఇసుక వెంటనే అందించాలని ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ మండలం తోకతిప్పలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మిక రంగం సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారన్నారు. అధికారం చేపట్టి వంద రోజులైనా నేటికీ ఉచిత ఇసుక పాలసీ అమలు చేయకపోవడం వల్ల దాని మీద ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇసుక దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బర్రె రమేష్, మోక మీరాసాహెబ్, సిపిఎం నాయకులు బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

## అందుబాటులో జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ, పరిసర గ్రామాల ప్రజలందరికీ డిపాజిట్లు, లోన్లు, తదితర లావాదేవీలు జరుపుకునేందుకు జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అందుబాటులో ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక పోస్టాఫీసు పక్కన జాంపేట కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 11వ బ్రాంచిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. బ్యాంక్ నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. 98 సంవత్సరాల క్రితం ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు బ్యాంకింగ్ మంచి వ్యాపార స్థాయికి చేరిందన్నారు. బొమ్మన వారి నిర్వహణలో బ్యాంకులు పనితీరు బాగుంటుందని, ప్రజలు మన్ననలు పొందుతారని అన్నారు. అన్ని బ్యాంకులతో సమానంగా అన్ని సదుపాయాలు ఉంటాయని, పెద్ద, చిన్న వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సహకార శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఛైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ ఛైర్మన్ రొబ్బి విజయ శేఖర్, చలసాని రాఘవేంద్రరావు, చల్లా శంకరరావు పాల్గొన్నారు.

## మావుళ్లమ్మకు 553 గ్రాముల వెండి విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన గుండు నాగ వెంకట కృష్ణావతారం 250 గ్రాముల వెండి, తెలంగాణ కల్వకుర్తికి చెందిన కె.కవితాఆనంద్ 303 గ్రాములు వెండిని విరాళంగా ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు శేషవస్త్రం, అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - ఉండి

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారంగా కోటి రూపాయలు విరాళం అందిస్తున్నట్లు బిఎంఆర్ అధినేత, రాజ్యసభ మాజీ సభ్యులు బీద మస్తాన్‌రావు ప్రకటించారు. కోలమూరు గ్రామంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలకృష్ణం రాజు నూతన వ్యాపార ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు నాణ్యమైన మేతను తక్కువ ధరకు అందించి రైతుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం సీడ్, ఫీడ్ ఉత్పత్తిదారుల సంఘం జాతీయ అధ్యక్షుడుగా ఉన్న తాను ఆక్వా రైతుల అభివృద్ధి కోసం ధరలు తగ్గించి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల సత్యనారాయణ రాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, తోట రాము, జి.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారం, ఉండి గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ నిధులను వెచ్చించి పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామంలో రూ.10 లక్షల నిధులతో హైస్కూల్ వద్ద సిసి డ్రెయిన్లు నిర్మించడానికి, ఉండి చిక్కాల వీరన్న నగర్ కాలనీలో 11,50,000 నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఉండి గ్రామాధ్యక్షులు కాగిత బుజ్జి, అగ్రహారం గ్రామ అధ్యక్షులు దూసనపూడి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద్ వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## కోలాహలం.. సాగరతీరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

## మావుళ్లమ్మ సన్నిధిలో ప్రత్తిపాడు ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మ అమ్మవారిని పత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రసాదాలు, శేషవస్త్రం, ఫొటో అందచేశారు.

## రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం నరసాపురం ఏరియా ఆసుపత్రిలో రూ 1.20 లక్షల విలువ చేసే ఆర్ఒ ప్లాంట్‌ను ఎన్‌ఆర్ఐ నరహరశెట్టి సాయి దుర్గాగణేశ్ బహూకరించారు. ఆర్ఒ ప్లాంట్‌ను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు ఎంఎల్ఎ నాయకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సత్యవతి, ఆసుపత్రి సూపరిటెండెంట్ సుప్రియ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## గొల్లలకోడేరు గ్రామాభివృద్ధికి కృషి

### ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. గ్రామంలో రూ.10 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వేగంగా దూసుకెళ్తోందని తెలిపారు. మాజీ సర్పంచి గాదిరాజు వెంకట సత్య సూర్యనారాయణరాజు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఎంఎల్ఎ ఎంతో అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసి నాయకులు కామన రాంబాబు, గ్రామ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

## నేడు పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుమంట్ర

పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ సోమవారం మధ్యాహ్నం మండలంలోని మాముడూరు, గరువు గ్రామాల్లో రూ.39 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివివిఎస్.శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ ద్వారా మాముడూరులో రూ.9 లక్షలతో, గరువులో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

## జనసేనలోకి చేరికలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మొగల్తూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచి బోణం నరసింహారావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, దూసనపూడి దొరబాబు ఆధ్వర్యంలో సుమారు 200 మంది జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా నాయకర్, సుబ్బారాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పి.వెంకన్న, బందుల ఎలీషా, పులపర్తి సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

## నేడు పెనుమంట్ర మండల పరిషత్ సమావేశం

**పెనుమంట్ర:** ఈ నెల 14వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బివివిఎస్.శర్మ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు కెవిఎన్.రెడ్డి (వాసు) అధ్యక్షతన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

**మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు**

**O.S.No. 153/2013**

*బిట్వీన్:*

మట్ట మధుసూధన రావు ...*Plaintieff*

**AND**

వెలగల వెంకట రమణ రావు & 29 Others ...*Defendants*

*28వ డిఫెండెంట్:*

గుమ్మడి స్వరాజ్య లక్ష్మి, భర్త: లేటు రామకృష్ణ రావు, ఫిమేల్, వయస్సు 65 సం॥లు, R/o.విజయరాజు విలేజ్, పెద్దవేగి మండలం, ఏలూరు జిల్లా - ప॥గో॥జిల్లా.

పై నెంబరు గ్రంథంలో మీరు 28వ డిఫెండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికాముఖంగా తెలియజేయునది ఏమనగా **ది.29-10-2024వ తేదీన పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు వారి ఎదుట మీయొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది.** కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల సదరు పై నెంబరు గ్రంధము మీయొక్క పరోక్షముగా విచారించబడును.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

*వాయిదా తేదీ: ది.29-10-2024*

మాగంటి లక్ష్మణ్ కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 98852 79889

స్థిరాస్థి వేలం ప్రకటన

**మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సినియర్ డివిజన్) వారి కోర్టు**

**ఇ.పి.నెం.78/2016 ఇన్ ఎఎ/సిఎఫ్/నెం.139 ఆఫ్ 2015**

*బిట్వీన్:*

మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి, రిప్రజెండెట్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్. ...*డిక్రీ హోల్డర్*

**AND**

ఆచంట నాగ సత్యశ్రీనివాస ప్రభాకర్ & 6 Others ...*జడ్జిమెంట్ డెబిటార్స్*

*1వ జే.డి.ఆర్:* ఆచంట నాగ సత్య శ్రీనివాస ప్రభాకర్, తండ్రి: నర్సింహారావు, డో.నెం.17-1-245, అయ్యగారి వారి వీధి, రుస్తుంబాద, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం 1వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి.షెడ్యూలు దాఖలా స్థిరాస్థులను (1,2 అయిటమ్స్) **ది.28-10-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు బహిరంగ వేలం జరుగునని తెలియపరచటమైనది.** కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

1వ జె.డి.ఆర్.కు చెందిన ప్రోపర్టీ షెడ్యూల్స్ వివరములు

*ఐటమ్ నెం.1:* పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.124/2008 నర్సాపురం సబ్ డివిజన్ మున్సిపల్ ఏరియా ఖాళీ స్థలం పాత 23వ వార్డు, క్రొత్త 25వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ దగ్గరలో పాత డో.నెం.16-3-27, క్రొత్త డో.నెం.16-3-69, సర్వే నెంబరు 617/2ఎ లో గల చ॥గ॥ 316-3కు ఈ క్రింది సరిహద్దులు: *తూర్పు:* అ॥48.5 (6అ॥లు) వై.వి.లక్ష్మణరావు, ఉమ్మడి మార్గం. *దక్షిణం:* అ॥58.5 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. *పడమర:* అ॥48.0 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. *ఉత్తరం:* అ॥59.5 (13అ॥లు) వెడల్పు ప్రధాన వీధి.

**డిక్రీ హోల్డర్ విలువ : రూ.10,00,000/-**
**మార్కెట్ విలువ : రూ.15,80,000/-**

*ఐటమ్ నెం.2:* పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.585/2010, నర్సాపురం సబ్ డివిజన్ మున్సిపల్ ఏరియా అయ్యగారి వీధి 27వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ ఆర్.సి.సి. బిల్డింగ్, డో.నెం.17-1-245/3, సర్వే నెం. 564/18లో గల చ॥గ॥ 159.8కు ఈ క్రింది సరిహద్దులు: *తూర్పు:* అ॥26.00 మున్సిపల్ రోడ్. *దక్షిణం:* అ॥49.00 దాసరి వెంక లక్ష్మి గారి స్థలం వగైరాలు. *పడమర:* అ॥26.00 ఉమ్మడి మార్గం ఆకుల శేషయ్య ఇతరులు. *ఉత్తరం:* అ॥61.8 కోడూరి సుబ్బారావు గారి స్థలం.

**డిక్రీ హోల్డర్ విలువ : రూ.25,00,000/-**
**మార్కెట్ విలువ : రూ.7,99,000/-**

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

నర్సాపురం, 13-10-24.
ఎం.సత్యకృష్ణ
అడ్వకేట్, నర్సాపురం.